క్లుప్తంగా

అన్నదానం

గూడూరురూరల్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ప్రాంగణంలో సోమవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రవి హోమ్‌నీడ్స్ అధినేత రవికుమార్ దాతృత్వంతో నిరుపేద గర్భిణులకు భోజనం, అరటిపండ్లను డాక్టర్ సందీప్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. సంస్థ సభ్యులు చెంచునారాయణ, నాగరాజు, పురుషోత్తమరావు, కటకం శ్రీనివాసులు, జగదీష్, ప్రభాకర్, విజయ్‌బాబు, సాయి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఓజిలి: మండలంలో భూ సమస్యలు పరిష్కరించాలని వైఎస్సార్ సీపీ నాయకులు తహసీల్దార్ శివరామసుబ్బయ్యని కోరారు. నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన శివరామసుబ్బయ్యను వైఎస్సార్ సీపీ మండల నాయకులు కలిశారు. జేసీఎస్ మండల కన్వీనర్ షేక్ ఖాదర్‌బాషా, జిల్లా కార్యదర్శి దేశిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్ కే ప్రభాకర్‌రాజు, జే రవి, నారాయణ, శంకర్, ఎంపీటీసీ సభ్యుడు జీ రఘురామరాజు, సీనియర్ నేత కే వెంకటసుబ్బరాజు, బీ రవీందర్‌రెడ్డి, వేణురెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

జేసీ సమీక్ష నేడు

పెళ్లకూరు: మండలంలోని చిల్లకూరులో మంగళవారం జరగనున్న జగనన్న సురక్ష కార్యక్రమానికి జేసీ డీకే బాలాజీ హాజరై వివిధ రెవెన్యూ సమస్యలపై సమీక్షించనున్నట్లు సోమవారం తహసీల్దార్ రామయ్య తెలిపారు. ముఖ్యంగా 71వ జాతీయ రహదారి విస్తరణతో భూములు, ఇళ్ల స్థలాలు కోల్పోయిన నిర్వాసితులకు పరిహారం చెల్లింపు విషయంలో జాప్యంపై అధికారులతో చర్చిస్తారన్నారు.

వందరోజులు పని కల్పించాలి



ఓజిలి: ఉపాధి హామీ పథకంలో ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించాలని ఎంపీడీఓ రజనీకాంత్ అన్నారు. మండలంలోని వెంకటరెడ్డిపాళెంలో ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న ఒరవకాలువ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఏపీఓ ఉషారాణి, ఈసీ ఖలీల్, టీఏ మహేష్ కుర్ తదితరులు ఉన్నారు.

బహుమతులు ప్రదానం




రాపూరు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల్లో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు శ్రీకిరెడ్డి రాఘవరెడ్డి చారిటలబుల్ ట్రస్టు నిర్వాహకులు సోమవారం ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. జెడ్పీ హైస్కూలు విద్యార్థి అవినాష్‌కు రూ.10 వేలు, చరణ్‌కు రూ.5 వేలు, చైతన్యరమణకు రూ.3 వేలు అందజేశారు. అలాగే బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని హన్సిక బేగంకు రూ.10 వేలు, సారాశ్రీనిధికి రూ.5 వేలు అందజేసి, సన్మానించారు. శ్రీకిరెడ్డి రాఘవరెడ్డి చారిటలబుల్ ట్రస్టు నిర్వాహకులు శ్రీకిరెడ్డి శశిధర్‌రెడ్డి, శీను, వినోద్‌రెడ్డి, రాధారెడ్డి, హెచ్ఎంలు దయాకర్, లీలాకుమారి పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆడికృత్తిక

నాయుడుపేటటౌన్: పట్టణంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయంలో 12 తేదీ నుంచి ఆడి కృత్తిక ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చదలవాడ మోహన్‌కృష్ణశర్మ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 12వ తేదీ శ్రీచక్ర మహామెరువుతోపాటు 108 వేలాయుధాలకు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 13నఆడి కృత్తిక రోజున 108 వేలాయుధాలతో నగరోత్సవం, కల్యాణోత్సవం, సుబ్రహ్మణ్య మూలమంత్ర పూజలను నిర్వహించనున్నట్లు చెప్పారు. 14న ఏకాంతసేవ పూజలతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

కుష్టువ్యాధిగ్రస్తులు గుర్తింపు



రాపూరు: కుష్టువ్యాధిగ్రస్తుల సర్వేలో భాగంగా రాపూరులో జరిపిన సర్వేలో ఐదుగురికి కుష్టువ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయ్యిందని కుష్టువ్యాధి నివారణ జిల్లాజోనల్ అధికారి సతీష్ తెలిపారు. రాపూరులోని తూర్పుఅగర్తకట్టలో సోమవారం వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధిగ్రస్తులకు 8 మాసాలు చికిత్స చేస్తామన్నారు. జిల్లాలో కుష్టునిర్మూలనే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. మోహన్‌రావు పాల్గొన్నారు.

చీరలు పంపిణీ

గూడూరురూరల్: పట్టణంలోని బాలాజీనగర్‌లో ఉన్న ప్రగతి సేవా సంస్థ కార్యాలయంలో అల్లం పుల్లయ్య జయంతి సందర్భంగా ఆయన కుటుంబసభ్యుల దాతృత్వంతో నిరుపేద మహిళలకు చీరలు, వెజిటబుల్ బిర్యానీ పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు కే చంద్రశేఖర్, కోశాధికారి కే శ్రీనివాసులు, సభ్యులు శ్రీనివాసులు, సుబ్రమణ్యం, కేఆర్‌ఎం, దాతలు అల్లం రమణమ్మ, కు మారులు అల్లం కిరణ్‌కుమార్, సాయి కృష్ణచైతన్య, సుప్రియ పాల్గొన్నారు.

ముంగిటే వైద్యం.. పేదలకు ఆనందం

- ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటి వద్దనే ఉచిత వైద్యసేవలు
- రోగులకు రక్త, బీపీ, షుగర్ పరీక్షలు
- మందుల పంపిణీ
- హర్షం వ్యక్తం చేస్తున్న పేదలు



తిరుమలపూడిలో వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు

ధనికులకు ఫ్యామిలీ డాక్టర్ ఉండడం సహజం. ఆ కుటుంబంలో ఎవరికి ఏ చిన్న సమస్య వచ్చినా ఆ వైద్యుడిని సంప్రదిస్తారు. ఆయన ఇంటికే వచ్చి వైద్యం అందిస్తారు. పేదలకు ఇలాంటి సౌకర్యం గగనమే. ఆ లోటును భర్తీ చేయడానికి సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఫ్యామిలీ డాక్టర్ పథకాన్ని అమలు చేశారు. ఇందులో ఇంటికో వైద్యుడు ఉండరు కానీ, ప్రతి గ్రామంలో ప్రతి పేద వాడికి వైద్యం అందుతోంది. వారి ఆరోగ్యస్థితిపై నిత్యం పర్యవేక్షణ కొనసాగుతుంది. దీనిపై ప్రత్యేక కథనం.

ఓజిలి: రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వైద్యసేవలు మరింత మెరుగుపర్చాలన్న లక్ష్యంతో వైఎస్సార్ సీపీ సర్కారు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గతేడాది అక్టోబర్ 22వ తేదీన దేశంలో గొప్ప మార్పునకు పల్నాడులోని చిలకలూరుపేట మండలం లింగంగుంట్లలో మొదటి అడుగు పడింది. దీంతో గ్రామీణులు డాక్టర్ కోసం ఎక్కడికి వెళ్లాల్సిన అవసరం లేకుండా పోయింది. ఆస్పత్రులు, డాక్టర్ల చుట్టూ తిరిగే పని తప్పింది. ఇంటి ముంగిటే వైద్యసేవలు అందుతుండడంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

అందుబాటులో వైద్యసిబ్బంది

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం అమలుతో గ్రామీణులకు వైద్యసిబ్బంది అందుబాటులో ఉన్నారు. గత ప్రభుత్వం వైద్య ఆరోగ్య రంగాన్ని గాలికొదిలేసింది. ప్రజలకు వైద్యసేవలు అందించడంలో విఫలం కావడంతో ప్రజలు వైద్యం కోసం తీవ్ర ఇబ్బందులు పడేవారు. అయితే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ పరిస్థితులు మారిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వమే ఫ్యామిలీ డాక్టర్ పేరిట వైద్యులు, సిబ్బందిని గ్రామాలకు పంపి వైద్య పరీక్షలు చేయిస్తోంది. రోగులకు మందులను ఉచితంగా అందిస్తోంది. మండలానికి ఒక్క 104 వైద్య సేవల వాహనం ఉండగా, వైఎస్సార్ విలేజ్‌హెల్త్‌క్లినిక్ – ఫ్యామిలీ ఫిజిషియన్ పేరుతో మరో వాహనాన్ని సమకూర్చింది. అందులో ప్రత్యేక వైద్య సిబ్బందిని నియమించింది. ఈ వైద్యసిబ్బంది ప్రతి సచివాలయం పరిధిలో నెలకు రెండుసార్లు పర్యటించి రోగులకు వైద్య సేవలు అందించి మందులను పంపిణీ చేస్తోంది. గ్రామాల్లో ఉదయం 9 గంటలు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వైద్యసేవలు అందిస్తున్నారు. 104 వాహనంలో అత్యాధునిక ఈసీజీ, హెచ్‌బీ, గర్భిణులకు హర్ట్‌బీట్, రేట్‌మానిటర్‌లతో పాటుగా 14 రకాల వైద్యపరీక్షలు నిర్వహించి 90 రకాల మందులను అందిస్తోంది. దీంతో గ్రామీణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పేదలకు వరం



ఫ్యామిలీ డాక్టర్ పథకం పేదవారికి వరం. గతంలో ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి మందులు తెచ్చుకునేవాళ్లం. ప్రస్తుతం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో గ్రామంలో మందులను తీసుకుంటున్నాను. 104, ఫ్యామిలీ ఫిజిషియన్ వాహనం వద్దనే పరీక్షలు చేయించుకుంటున్నాం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు మేలు చేస్తున్నాడు.

–పద్మమ్మ, మానమాల

అన్ని మందులు ఇస్తున్నారు



గతంలో ఏ చిన్న వ్యాధిసోకిన ప్రైవేటు వైద్యశాలలకు పరుగులు తీసేవాళ్లం. ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుణ్యామని 104 వాహనం వద్దనే పరీక్షలు చేయించుకుని అన్ని మందులు తీసుకుంటున్నాం. బీపీ, షుగర్, ఆస్తమా, ఈసీజీ వంటి పరీక్షలు చేయించుకుంటున్నాం. వైద్యులు అందుబాటులో సేవలు అందిస్తున్నారు.

–సుబ్బయ్య, ఓజిలి

పేదలను ఆదుకోవడమే ధ్యేయం



గ్రామీణ ప్రాంతాల్లోని పేదలను ఆదుకోవడమే ఫ్యామిలీ డాక్టర్ పథకం ధ్యేయం. ప్రత్యేక వైద్య సిబ్బందితో వైద్య సేవలను అందిస్తున్నాం. ప్రభుత్వం అన్ని రకాల మందులను సరఫరా చేస్తోంది. రోగులకు అవసరమైన మందులు ఆస్పత్రులలో అందుబాటులో ఉండడంతో పంపిణీ చేస్తున్నాం. ఆరోగ్యశ్రీ శస్త్రచికిత్సలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు వైద్య సలహాలు ఇస్తున్నాం.

–మాధవ్, వైద్యాధికారి, పెదపరియ

బీఎల్‌ఓలు బాధ్యతగా పని చేయాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ కిరణ్‌కుమార్

చిల్లకూరు: ఎన్నికల ప్రక్రియను చేపట్టిన బూత్‌లెవల్ అధికారులు తమకు అప్పగించిన విధులను బాధ్యతగా పూర్తి చేయాలని ఆర్డీఓ కిరణ్‌కుమార్ సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం మండలంలోని బీఎల్‌ఓలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కొత్తగా ఓటుహక్కు పొందుకునేందుకు మీ దగ్గరకు వచ్చిన వారికి ఎలా నమోదు చేసుకోవచ్చనే విషయాలపై అవగాహన కల్పించాలన్నారు. అలాగే ఎన్నికల ప్రక్రియకు సంబంధించి కేంద్రంలో ఎవరు ఉంటారు, వారి విధులు ఏమిటి అనే విషయాలపై ముందుగా తెలుసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన ప్రాంతాల్లో ఓట్లను నమోదు చేయడంతో పాటుగా ఎవరైనా ఆన్‌లైన్‌లో చేసుకుంటామని వస్తే వారికి సహకారం అందించాలని సూచించారు. ఈ సమీక్షలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ నిర్మలాదేవి, డిప్యూటీ తహసిల్దార్ అజ్మతుల్లాఖాన్, ఆర్ఐ రమ్యస్వాతి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



ఆర్డీఓకు అర్జీ అందజేస్తున్న ముస్లింలు

గూడూరురూరల్: స్పందన కార్యక్రమంలో భాగంగా ప్రతి సోమవారం ప్రజలు అందించే అర్జీలకు సంబంధించిన సమస్యలు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్డీఓ ఎం.కిరణ్‌కుమార్ తెలిపారు. గూడూరులోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. చిల్లకూరు మండలం తొణుకుమాల గ్రామానికి చెందిన ముస్లింలు భూ సమస్యను పరిష్కరించాలని అర్జీలు అందజేశారు. వెంటనే చిల్లకూరు తహసీల్దార్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే గూడూరు మండలంలోని తిరువెంగళాయపల్లె గ్రామానికి చెందిన యానాదమ్మ తనకు ఐదేళ్లుగా రేషన్ బియ్యం రావడం లేదని, పింఛన్‌కు దరఖాస్తు చేసుకున్నా రేషన్‌కార్డు యాక్టివ్‌లో లేని కారణంగా రాలేదని వాపోయారు. రేషన్‌కార్డు సమస్యను వెంటనే పరిష్కరించాలని డీటీకి సూచించారు. గూడూరు పట్టణ సమీపంలోని గాంధీనగర్‌లో ఉన్న ఎస్టీ బాలికల మినీ గురుకులంలో 9 మంది అనాథ బాలికలు చదువుతున్నారని, వారికి ఎలాంటి ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలు లేనికారణంగా చదువులకు ఇబ్బందులు కలుగుతున్నాయని, వారికి ఆధార్‌కార్డులు మంజూరు చేయించాలని గురుకులం హెచ్‌ఎంతోపాటు సామాజిక కార్యకర్త వెంకటకృష్ణయ్య ఆర్డీఓకు విన్నవించారు. చిన్నారులను చూసి చలించిపోయిన ఆర్డీఓ కిరణ్‌కుమార్ వారికి రెండు రోజుల్లో ఆధార్‌కార్డులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

'మా భూమి ఇమ్మని ఒత్తిడి చేస్తున్నారు!'

చిల్లకూరు: తమ భూమి ఇతరులకు ఇమ్మని నాయకులు, అధికారులు ఒత్తిడి చేస్తున్నారని, తమకు న్యాయం చేయాలని కోరుతూ తొణుకుమాల గ్రామానికి చెందిన షేక్ మీరా సాహెబ్, కాలేషా సాహెబ్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు ప్రభుత్వం 15–2లో ఒక్కొక్కరికి 2 ఎకరాల భూమిని కేటాయించిందన్నారు. ఆభూమిని సాగు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నామని చెప్పారు. కాగా గ్రామానికి చెందిన రాగి మస్తానయ్య అనే వ్యక్తికి చెందిన 80 సెంట్ల భూమిని సర్వేయర్లు శ్మశానానికి కేటాయించారన్నారు. అందుకు బదులుగా తాము సాగు చేసుకుంటున్న రెండెకరాల్లో నుంచి 80 సెంట్ల భూమి తనకు ఇవ్వాలని మస్తానయ్య పట్టుబడుతున్నాడని, అతనికి కింద స్థాయి రెవెన్యూ అధికారులు, స్థానిక నాయకులు వత్తాసు పలుకుతూ తమపై ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. తమరు పరిశీలించి న్యాయం చేయాలని వారు కోరారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ రెండు రోజుల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించి న్యాయం చేస్తామని తెలిపారు.

3 పూరిళ్లు దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కలువాయి: మండలంలోని చీపినాపి గిరిజన కాలనీలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు పూరిళ్లు దగ్ధమయ్యాయి. బాధితుల కథనం మేరకు.. చీపినాపి గిరిజన కాలనీలో రాగి మురళి, అతని సోదరుడు, కొమరగిరి ప్రసాద్ పక్కపక్కనే పూరిళ్లలో నివాసముంటున్నారు. రోజులాగే ఉదయం యథావిధిగా ముగ్గురి కుటుంబాల్లోని వారందరూ పనులకు వెళ్లారు. ఇళ్లలో ఎవరూ లేని సమయంలో కొమరగిరి ప్రసాద్ ఇంట్లో షార్ట్‌సర్క్యూట్ జరిగి ఇంటికి నిప్పంటుకుంది. ఆ సమయంలో గాలి వీయడంతో మంటలు ఎగిసిపడి, పక్కనే ఉన్న రాగి మురళి, అతడి సోదరుడి ఇళ్లకు వ్యాపించాయి. గుర్తించిన స్థానికులు మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించారు. ఫలితం లేకపోవడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందజేశారు. వారు వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే మూడు పూరిళ్లలో దుస్తులు, వస్తువులు, డాక్యుమెంట్లు మొత్తం కాలిపోయాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ. 2 లక్షలు ఆస్తినష్టం సంభవించినట్లు బాధితులు తెలిపారు.

ఆలయాభివృద్ధికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

వాకాడు(చిట్టమూరు): చిట్టమూరు మండలం మల్లాంలో ఉన్న శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాభివృద్ధికి కోట మండలానికి చెందిన దాతలు సోమవారం రూ.లక్ష విరాళం ఇచ్చారు. కోట గ్రామానికి చెందిన కంతం వెంకటసుబ్రమణ్యం, ఆయన సతీమణి ఉషారాణి, కుమారుడు షణ్ముగ సందీప్‌లు ఈ నగదును ఆలయ చైర్మన్ చిల్లకూరు సాయికుమార్‌రెడ్డికి అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ దాతలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు మూలంరాజు, భానుప్రకాష్‌శర్మ, సిబ్బంది సుబ్బరామయ్య, శ్రావణ్ పాల్గొన్నారు.

గుండె పోటుతో కూలీ మృతి

చిల్లకూరు : మండలంలోని అన్నంబాకలో సోమవారం ఉదయం ఉపాధి హామీ పనికి వెళ్లిన ఓ కూలీ గుండెపోటుతో మృతి చెందాడు. వివరాలు.. గ్రామానికి చెందిన బళ్లారి నాగేశ్వరరావు (50) స్థానిక మల్రిగుంట చెరువు వద్ద ఉపాధి పనికి వెళ్లాడు. కాసేపటికే గుండెనొప్పి అంటూ కుప్ప కూలిపోయాడు. తోటి కూలీలు వెంటనే ఆటోలో ఆస్పత్రికి తరలిస్తుండగా మరణించాడు. ఏపీఓ గిరిబాబు ఈ ఘటనపై డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్‌కు సమాచారం అందించారు.

అంబేడ్కర్ విగ్రహం ప్రారంభం

దొరవారిసత్రం: మండలంలోని శ్రీధనమల్లి ప్రాథమిక పాఠశాల సమీపంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని సోమవారం అంబేడ్కర్ బీమ్ ఆనయ సేవా సంస్థ ఆధ్వర్యంలో దళిత నాయకులు ఘనంగా ప్రారంభించారు. తొలుత అంబేడ్కర్ చిత్ర పటాన్ని ఊరేగించారు. అనంతరం విగ్రహావిష్కరణ చేశారు. విగ్రహం దాత బాలశౌరి, నాయకులు చెంగయ్య, చిన్నా, దేవదానం, మోహన్, ప్రసాద్‌రెడ్డి, రమణయ్య, మున్నెయ్య, పుల్లయ్య, ప్రభాకర్, శివరామయ్య పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి రూ.3 కోట్లు మంజూరు

కోట: పట్టణంలో ప్రధాన రహదారుల నిర్మాణానికి రూ.3 కోట్లు నిధులు మంజూరైనట్లు ఆర్‌అండ్‌బీ డీఈఈ వెంకటసుబ్బయ్య సోమవారం తెలిపారు. కోటక్రాస్‌రోడ్డు నుంచి ఎన్‌సీఆర్ నగర్ వరకు తారు రోడ్డుతోపాటు అక్కడ నుంచి ఆర్టీసీ సెంటర్ మీదుగా కొక్కుపాడు రోడ్డు వరకు సీసీ రోడ్డు నిర్మించనున్నట్లు తెలిపారు. త్వరలో పనులు ప్రారంభమవుతాయన్నారు. కోటలో ఇప్పటికే అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. బజారువీధిలో ఆక్రమణలు తొలగించి రోడ్లు వెడల్పు చేయడంతో రూపురేఖలు మారాయన్నారు.

పారదర్శకంగా పథకాల అమలు

వాకాడు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ఎలాంటి అవినీతికి తావులేకుండా పారదర్శంగా అమలవుతున్నాయని పీఏసీఎస్ అధ్యక్షుడు కే.దా మోదర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన వైఎస్సార్ సీపీ నేతలతో కలసి ఏఎంసీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వంలో నీరు–చెట్టు పనుల నుంచి పేదోడికి మంజూరైన రుణాలు, పింఛన్లు సైతం దోచుకుతిన్న ఘనత వాకాడు మండల టీడీపీ నాయకులకే దక్కిందన్నారు.

జగనన్న సురక్షను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఏఓ

ఓజిలి: మండలంలోని మాచవరం సచివాలయంలో మంగళవారం జరిగే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రత్యేక అధికారి సుమన్‌రెడ్డి పిలుపునిచ్చారు. కుందాం, తిరుమలపూడి, మాచవరం, ముమ్మాయపాళెం గ్రామాల్లోని లబ్ధిదారులకు సర్పంచ్‌ల చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రాలను అందించనున్నట్లు తెలిపారు.

బాధ్యతగా సర్వే చేయాలి

సైదాపురం: సచివాలయం ఉద్యోగులు, వలంటీర్ల బాధ్యతగా ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న సురక్ష సర్వే కార్యక్రమాన్ని చేపట్టాలని ఏఓ పురుషోత్తం శివకుమార్ తెలిపారు. మండలంలోని లింగసముద్రంలో సర్పంచ్ వరప్రసాద్‌రాజు ఆధ్వర్యంలో సోమవారం జగనన్న సురక్ష పథకంపై సర్వే చేశారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి వారికి వచ్చిన సంక్షేమ ఫలాలు వివరాలను సేకరించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



నవరత్నాల రంగవల్లిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య తదితరులు

తడ: రాష్ట్రంలో ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం గ్రద్దగుంట పంచాయతీలోని గ్రద్దగుంట, అక్కంపేట గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. డీసీఎంఎస్ డైరెక్టర్ గండవరం సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున కిలివేటికి ఘన స్వాగతం పలికారు. కిలివేటి ఇంటింటికీ వెళ్లి అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ, సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి బుక్‌లెట్లు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో నాయకులు ఏ గ్రామానికి వెళ్లినా ఇళ్లు, ఇళ్ల స్థలాలు, పింఛన్లు, రేషన్ కార్డులు తదితర సమస్యలు చెప్పేవారన్నారు. సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆ పరిస్థితి లేదని అన్నారు. అక్కడక్కడ ఏమైనా సాంకేతిక కారణాలతో ఆగిన పథకాలు కూడా పూర్తిగా అందించేందుకు తాజాగా అమలు చేసిన జగన్న సురక్ష కార్యక్రమంతో అన్ని సమస్యలు పరిష్కారమవుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, తడ ఎంపీపీ కే రఘురెడ్డి, ఏపీబీ జిల్లా డైరెక్టర్ ఎం మునీష్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ఎం వీ కృష్ణారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ ఆర్‌కే సుందర్‌రెడ్డి, సర్పంచ్ కాటయ్య, వైస్ ఎంపీపీ కే వెంకటేష్, నాయకులు మునిరత్నంరెడ్డి, కే ఆర్ముగం, టీ కోదండం, మునుస్వామిరెడ్డి పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ క్షమాపణలు చెప్పాలి



శిరీషాయాదవ్

సైదాపురం: వలంటీర్లపై తప్పుడు ఆరోపణలు చేసిన పవన్‌కళ్యాణ్ క్షమాపణలు చెప్పాల్సిందేనని రాష్ట్ర సంగీత నృత్య అకాడమీ చైర్‌పర్సన్ పొట్లేళ్ల శిరిషాయాదవ్ డిమాండ్ చేశారు. మండలంలోని తురిమెర్ల గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కష్టపడి పనిచేసే వలంటీర్లపై పవన్ కళ్యాణ్ లేనిపోని ఆరోపణలు చేయడం దారుణమన్నారు. ప్రభుత్వ పథకాలు అమలులో వలంటీర్లు అంకితభావంతో పని చేస్తున్నారన్నారు. అలాంటి వలంటీర్లపై తప్పుడు ఆరోపణలు చేయడమే కాకుండా వారి సేవలను కించపరుస్తూ మాట్లాడడం హేయమైన చర్య అన్నారు.

సీహెచ్‌ఓ ఆత్మహత్యాయత్నం

గూడూరురూరల్: చెన్నూరు పీహెచ్‌సీలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన షాలీషా అనే యువతి సోమవారం రాత్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బాధితురాలి కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గూడూరుకు చెందిన షాలీషా చెన్నూరు పీహెచ్‌సీ పరిధిలోని నెల్లటూరు గ్రామంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా పనిచేస్తోంది. ఈ క్రమంలో ఆమె నెల్లటూరులో నిద్రమాత్రలు మింగి, ఈ విషయాన్ని ఫోన్‌లో తన భర్తకు తెలిపింది. దీంతో వారు అక్కడికి చేరుకుని ఆమెను హుటాహుటిన పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ వైద్యం చేసేందుకు వారు నిరాకరించడంతో ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మెడికవర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న సహచర సీహెచ్‌ఓలు 12 మంది ఏరియా ఆస్పత్రికి చేరుకున్నారు. పీహెచ్‌సీ డాక్టర్ తమను వేధింపులకు గురిచేస్తోందని, జీతాలు మంజూరుకు లంచాలు అడుగుతోందని ఆరోపించారు. షాలీషా తాత ఇటీవల చనిపోయారని, సెలవు మంజూరు చేయాలని కోరితే ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడంతో మనస్తాపానికి గురై ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు పేర్కొన్నారు. ఈ విషయమై పీహెచ్‌సీ డాక్టర్ ప్రసూనను వివరణ కోరగా తాను ఐదు రోజులుగా సెలవులో ఉన్నానన్నారు. తాను సీహెచ్‌ఓలను విధులు సక్రమంగా నిర్వహించి, రికార్డులు రాయాలని చెప్పానే తప్ప వేధింపులకు పాల్పడలేదన్నారు. సెలవు విషయమై షాలీషా తనకు మెసేజ్ పెట్టిందని, విధుల్లో ఉన్న మరో డాక్టర్‌ను అడగాలని సూచించినట్లు తెలిపారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు



సైదాపురం: గర్భిణిని పరీక్షిస్తున్న డాక్టర్ శ్రావణి



దొరవారిసత్రం: గర్భిణిని పరీక్షిస్తున్న డాక్టర్ చైతన్య

సైదాపురం: గర్భిణులకు ప్రతినెలా అన్ని వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ శ్రావణి తెలిపారు. సైదాపురం పీహెచ్‌సీలో ప్రధానమంత్రి మాతృత్వ వందన అభియాన్ కార్యక్రమం ద్వారా సోమవారం గర్భిణులకు ప్రత్యేక వైద్యపరీక్షలు చేశారు. ఈ సందర్భంగా మండలంలోని సుమారు 85 మందికిపైగా గర్భిణులు వైద్యపరీక్షల కోసం విచ్చేశారు.

దొరవారిసత్రంలో..

దొరవారిసత్రం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం పీహెచ్‌సీ పరిధిలోని 32 మంది గర్భిణులకు వైద్యాధికారి చైతన్య వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. రక్తహీనత కలిగిన గర్భిణులకు ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పళణిరాజ్ పాల్గొన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి చర్యలు



ఎన్‌జెఆర్ కాంప్లెక్స్ ప్రాంతంలో పరిశీలిస్తున్న కమిషనర్, ఇంజనీరింగ్ కార్యదర్శులు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల సమీపంలో మున్సిపాలిటీకి చెందిన నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం త్వరిగతిన చేపట్టేందుకు చర్యలు చేపడుతున్నట్లు కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగ కార్యదర్శులు, వర్క్ ఇన్‌స్పెక్టర్లతో కలసి కూల్చివేసిన షాపింగ్ కాంప్లెక్స్ వద్ద కొత్తగా నిర్మించనున్న దుకాణసముదాయ నమూనాను పరిశీలించారు. గతంలో ఉన్న 30 దుకాణాలకు బదులుగా ప్రభుత్వ వైద్యశాలకు అంబులెన్స్‌లు తదితర వాహనాలు వెళ్లేందుకు ఉన్న 25 అడుగులు దారిని 28 అడుగులు వెడల్పు పోను దుకాణ సముదాయం నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేస్తున్నట్లు కమిషనర్ వెల్లడించారు. కమిషనర్ వెంట నాయకులు జయరామయ్య, ఎన్‌సీఆర్ ఉన్నారు.

అసత్య ఆరోపణలు సమంజసం కాదు



పింఛన్‌కు అర్హురాలిగా జారీ చేసిన సర్టిఫికెట్

వెంకటగిరిరూరల్: మండలంలోని దాచెరువు గ్రామానికి చెందిన చింతల రత్నమ్మ మంచానికే పరిమితమైన పింఛన్‌కు సంబంధించి కొన్ని పత్రికల్లో వస్తున్న వార్తలు అవాస్తవమని, అసత్య ఆరోపణలు రాయడం సమంజసం కాదని ఎంపీడీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ చెలికంపాడు పంచాయతీ సోమసానిగుంటకు చెందిన దళిత మహిళ కొన్ని ఏళ్లుగా మంచానికే పరిమితమైనా పింఛన్ మంజూరు కాలేదని కొన్ని పత్రికల్లో వచ్చాయని, కానీ ఆమెకు గత కొన్ని నెలల క్రితమే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి పింఛన్‌కు అర్హురాలిగా ధ్రువీకరించడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన పింఛన్లు మంజూరు చేసిన వెంటనే రత్నమ్మకు పింఛన్ నగదు పంపిణీ చేస్తామన్నారు.

ప్రజల సౌకర్యార్థమే ఉచిత మరుగుదొడ్లు



చిట్టమూరులో ఆక్రమణల వివరాల గురించి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరురూరల్: ప్రజల సౌకర్యార్థమే పట్టణంలోని ఐసీఎస్‌రోడ్డు, పాతబస్టాండ్, హాస్పిటల్ రోడ్డు, అంబేడ్కర్ నగర్ ప్రాంతాల్లో మరుగుదొడ్లు నిర్మించినట్లు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు తెలిపారు. సోమవారం హాస్పిటల్ రోడ్డులో నూతనంగా ప్రారంభించిన మరుగుదొడ్లను కమిషనర్ వెంకటేశ్వర్లుతో కలిసి పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ హాస్పిటల్ రోడ్డులో డాక్టర్ సి.రోహిణి, డాక్టర్ జనార్దన్‌రెడ్డి దంపతులు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో రూ.11లక్షల వ్యయంతో అధునాతన వసతులతో మరుగుదొడ్లను నిర్మించారన్నారు. ఆ మరుగుదొడ్ల నిర్వహణకు రుసుము వసూలు చేస్తున్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహణ బాధ్యతలు తీసుకుని ప్రజలకు ఉచితంగా సేవలు అందేలా చూడాలని సూచించారు. ఆయన వెంట పురపాలక డీఈ శ్రీనివాసమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నం మురళి, తదితరులు ఉన్నారు.

ఆక్రమణలను పరిశీలించిన ఎమ్మెల్యే

వాకాడు(చిట్టమూరు): చిట్టమూరు మండలం కొత్తగుంటలో పలు చోట్ల ఆక్రమణలకు గురైన భూములను సోమవారం ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు పరిశీలించారు. జిల్లా పరిషత్‌కు సంబంధించిన భూముల ఆక్రమణలపై అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొత్తగుంట కూడలికి ఇరువైపులా ఆక్రమణలను తొలగించాలని అధికారులకు సూచించారు.